## తల్లీ, బిడ్డల సంక్షేమమే లక్ష్యం

**పెద్దతిప్పసముద్రం:** తల్లీ, బిడ్డల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని ఎంపీపీ మహమూద్, వైస్ ఎంపీపీ శోభా, జెడ్పీటీసీ శివన్న అన్నారు. మంగళవారం మండలంలోని దిగవ కుక్కలపల్లిలో జరిగిన పోషక మాసోత్సవాల్లో వారు ఆరోగ్యంపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు.







# ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

### డీపీఓ, స్పెషల్ ఆఫీసర్ ధనలక్ష్మి

**మదనపల్లె :** ప్రజారోగ్యానికి రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. వివిధ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు, పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రతి ఒక్కరి ఆరోగ్య అవసరాలను గుర్తించి వాటిని తీర్చడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డీపీఓ, స్పెషల్ ఆఫీసర్ ధనలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై మండలస్థాయి సన్నద్ధతా సమావేశం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ ధనలక్ష్మి మాట్లాడుతూ..వైద్యరంగంలో ఫ్యామిలీ డాక్టర్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమం ద్వారా ప్రజలకు గ్రామీణస్థాయిలోనే వైద్యుల సంరక్షణను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం ఈనెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో మరో కార్యక్రమం ప్రారంభించనున్నదన్నారు. ప్రజల ఆరోగ్యసమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మండలంలోని 22 విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో), ఏఎన్ఎంలు ఇంటింటి సర్వేలో ప్రజలను స్క్రీనింగ్ చేసి సమస్యలున్న వారిని గుర్తించాలన్నారు. ప్రతి వీహెచ్‌సీలో క్యాంపులు నిర్వహించి ప్రజలకు అవసరమైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోని వైద్యులను మెడికల్ క్యాంపుల్లో భాగస్వామ్యులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ బావాజాన్, బొమ్మనచెరువు, సీటీఎం, చెంబకూరు మెడికల్ ఆఫీసర్‌లు స్వాతి, మహ్మద్‌ఫర్హాన్, జాన్సీ, నూరుల్లా, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎం, సీహెచ్ఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీపీఓ ధనలక్ష్మి

## అర్హులందరికీ పెన్షన్లు

**మదనపల్లె :** మున్సిపాలిటీలోని 1, 2 వార్డుల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నూతనంగా పెన్షన్లు మంజూరుచేసిందని కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి అన్నారు. మంగళవారం 1,2 వార్డు సచివాలయాల్లో నూతనంగా మంజూరైన 55 పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు.







# స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

**మదనపల్లె సిటీ:** మండల స్కూల్ గేమ్స్ పోటీలను మండల విద్యాశాఖ అధికారులు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్ ప్రారంభించారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలం నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. మండల కోఆర్డినేటర్ శివశంకర్ మాట్లాడుతూ మండల స్థాయిలో రాణించిన వారిని నియోజకవర్గస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలోజెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సుబ్బారెడ్డి, పీడీలు నాగరాజు, రమేష్,సుధాకర్, అన్సర్, నరేష్, రాంబాబు, సంగీత, జలజ పాల్గొన్నారు.

**చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి**

**వాల్మీకిపురం:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మదనపల్లి డీవైఈఓ క్రిష్ణప్ప అన్నారు. మంగళవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, 40మంది క్రీడాకారులు నియోజకవర్గ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.




## తాగునీటి సమస్య లేకుండా చేస్తాం

**మదనపల్లె :** పట్టణంలోని 35వార్డుల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మంగళవారం 31వవార్డులో బోరు డ్రిల్లింగ్ పనులను పూజాకార్యక్రమాలతో ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో మదనపల్లె మున్సిపాలిటీ, నిమ్మనపల్లె మండలంలో ఇంటింటి పర్యటన పూర్తిచేశామన్నారు. మున్సిపాలిటీలో దాదాపు ఏడాదికాలం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానికులు ప్రస్తావించిన సమస్యలు, తాగునీటి బోర్లు, డ్రైయిన్లు, సీసీ రోడ్లు తదితరాలకు సంబంధించి ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తిచేస్తూ వస్తున్నామన్నారు. మరో 3 నెలల్లో పట్టణంలోని 35 వార్డుల్లో ప్రజలు కోరుకున్న అభివృద్ధి పనులన్నీ పూర్తిస్థాయిలో ఏర్పాటవుతాయన్నారు. అన్ని వార్డుల్లోనూ అవసరమైన చోట బోర్లు వేసి నీటిసమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, డీఈ బండపల్లిశిరీషా, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, రాయల్‌రవీంద్ర, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


పూజాకార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా




## ఆర్టీసీ హౌసింగ్ సొసైటీ కేసు పరిష్కారం

**పీలేరు రూరల్ :** పీలేరు ఆర్టీసీ డిపో ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ కేసు ఎనిమిదేళ్ల అనంతరం స్థానిక కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో పరిష్కారమైంది. పీలేరులో డిపోలో 480 మంది ఉద్యోగులు ఒక్కొక్కరూ రూ.40 వేల చొప్పున చెల్లించి 15.70 ఎకరాల భూమిని యర్రగుంట్లపల్లె సమీపంలో కొనుగోలు చేశారు. కొనుగోలులో అవకతవకాలు జరిగాయని, ఆర్టీసీ సొసైటీలో పని చేస్తున్న కొందరూ సొసైటీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పీలేరు కోర్టులో గత ఎనిమిదేళ్లుగా కేసు నడుస్తోంది. ఆర్టీసీ ఉద్యోగులు ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరిగారు. ఈ నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి సహకారంతో పీలేరు మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా ఇరువర్గాలను ఒప్పించి కేసు రాజీ కుదిర్చారు. 450 కుటుంబాల ఇళ్ల నిర్మాణాలకు లైన్ క్లియర్ కావడంతో ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం స్థానిక కోర్టు వద్ద జి.వి. శ్రీనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగుల డి.ఆర్. నాయుడు, లక్ష్మయ్య, అర్జున్, యర్రయ్య, కృష్ణయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.


ఆర్టీసీ ఉద్యోగులతో మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి




## పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

**మదనపల్లె :** నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టరేట్ సమావేశమందిరంలో ఏఈఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ర్యాంపులు, మంచినీరు, టాయిలెట్లు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పునకు సంబంధించిన స్పష్టమైన నివేదిక సత్వరమే సమర్పించాలని సూచించారు. ఓటరుగా నమోదుచేసుకున్న వారి దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా గుర్తింపుకోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.







## పాటల సీడీ ఆవిష్కరణ


పాటల సీడీని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి

**పీలేరురూరల్ :** పేదల గుండెచప్పుడు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి అన్నారు. మిథున్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటరీ యువజన విభాగం కన్వీనర్ చైతన్యరెడ్డి ప్రత్యేకంగా ఎంపీ మిథున్‌రెడ్డిపై పాట రూపొందించారు. ఆ పాట సీడీని శ్రీనాథరెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

## ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి

**ములకలచెరువు:** ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి చొరవతోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని ఎంపీపీ సాయిలీలా అన్నారు. మంగళవారం పెద్దపాళ్యం పంచాయతీలో ప్రజాప్రతినిధులు, అధికారులు పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు.

**కురబలకోట:** మండలంలోని బైసానివారిపల్లె, అరవిందపురం,కామూరివారిపల్లె, కొత్తపల్లె, మద్దిరెడ్డిగారిపల్లె, జంగావారిపల్లె గ్రామాల్లో పల్లె బాట నిర్వహించారు. ఆగ్రామ సర్పంచ్ సుక్కా సుజాత ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు.

